క్లుప్తంగా

మైసంపల్లిలో బోరు ఏర్పాటు



సాక్షి స్పందన

దుగ్గొండి : మండలంలోని మైసంపల్లిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య నేపథ్యంలో 'తాగునీటికి తండ్లాట' శీర్షికతో ఈనెల 20న ప్రచురితమైన కథనానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించారు. గ్రామంలో బోర్ వేయించి మోటార్ అందజేశారు. దీంతో బోర్ నుంచి నీరు సమృద్ధిగా వస్తుండడంతో ఆదివారం జనం హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

భజన



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని వడ్లకొండ రాజ్‌కుమార్ నివాసంలో హనుమాన్ మాలాదారులు ఆదివారం భజన చేశారు. గురుస్వాములు గణపతి పూజ, లక్ష్మీపూజ, కలశం పూజ నిర్వహించారు. అనంతరం అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సంకటి చంద్రమౌళి, భూషబోయిన రాజేశ్, వనపర్తి మల్లయ్య, కార్తీక్, శివ, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

పర్వతగిరి : ధర్మసాగర్‌లోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో సాధారణ నిర్వహణ పనులు చేపట్టడం కోసం నేడు (సోమవారం) నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గ్రిడ్ ఏఈ సాయిరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎల్ఎండీ ధర్మసాగర్ సెగ్మెంట్‌లో జీడబ్ల్యూఎంసీ, . దర్మసాగర్, హసన్‌పర్తి, వేలేరు, జాఫర్‌గఢ్, ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

దళితుల ఆత్మీయ సమ్మేళనం

గీసుకొండ : మండలంలోని కోనాయమాకుల గ్రామ సమీపంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నేడు (సోమవారం) ఉదయం 9 గంటలకు పరకాల నియోజకవర్గ స్థాయి దళితుల (మాల, మాదిగ ఉపకులాల) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దుపాకి సంతోశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలతోపాటు పరకాల టౌన్, గ్రేటర్ వరంగల్ నగరంలోని 15, 16, 17 డివిజన్ల కాంగ్రెస్ దళిత నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమ్మేళనంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య పాల్గొంటారని వివరించారు.

కరపత్రం ఆవిష్కరణ

సంగెం : బీజేపీ తరఫున వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని నాయకులు మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, నాయకులు ప్రభాకర్, రమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లిలో యాదాండ్ల రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపించిన రూ.3 వేల నగదును బాధిత కుటుంబానికి నాయకులు మర్రెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగారం రవీందర్, వేణు, బుచ్చయ్య, ఐలయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన సామల ఉప్పలక్ష్మి శనివారం రాత్రి మృతి చెందగా ఆమె మృతదేహానికి కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎదురబోయిన రామస్వామి, వలస సత్యం, అరెపెల్లి బాబు, ఎల్లస్వామి, కటకం లక్ష్మి నారాయణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. బావి నిరుపయోగం



నిరుపయోగంగా ఉన్న బావిలో పుష్కలంగా నీళ్లున్న దృశ్యం

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యంతో కొత్తగా నిర్మించిన బావి నిరుపయోగంగా మారింది. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపాటి సమస్యలపై అధికారులు స్పందించకపోవడంతో కొత్తగా నిర్మించిన బావి వృథాగా ఉంటోంది. బావికి పైప్‌లైన్, విద్యుత్ కనెక్షన్ ఇస్తే ప్రజలకు నీరందే పరిస్థితి ఉన్నా ప్రభుత్వం నుంచి బిల్లు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్‌కు పనులు పూర్తి చేయకుండానే వదిలేశారు. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బావిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సంపేట మండలంలోని గురిజాలలో సుమారు పది వేలకుపైగా జనాభా ఉంటుంది. మూడు వేలకుపైగా కుటుంబాలున్నాయి. నీరు అందించేందుకు మూడు బావులు, రెండు బోర్లు, 22 చేతి పంపులున్నాయి. 2019లో అప్పటి సర్పంచ్ గోడిశాల మమత సదానందం గ్రామ శివారులోని పోలు చెరువు వద్ద రూ.30 లక్షలతో ప్రభుత్వం మంజూరు చేసిన పెద్ద బావి నిర్మాణం చేపట్టారు. కాగా ఎమ్మెల్యే సీడీఎఫ్ నుంచి, ప్రభుత్వ నిధులు చెల్లిస్తామని హామీ ఇచ్చి తదనంతరం చేతులు దులుపుకున్నట్టు విమర్శలున్నాయి. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో పైప్‌లైన్, విద్యుత్ కనెక్షన్ తదితర పనులను పెండింగ్‌లో ఉంచారు. ఇదిలా ఉండగా ఏటా నీటి సమస్య పెరుగుతుండడంతో ఉన్న వనరులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవగా నీటి ఎద్దడి ఏర్పడింది. అయితే బావికి విద్యుత్ కనెక్షన్, పైప్‌లైన్ లేకపోవడంతో అలాగే వదిలేశారు. ఆ మూడు బావుల్లో వేసవి కాలంలో నీరు తగ్గిపోవడంతో అదనంగా మరో రెండు బావులను అద్దెకు తీసుకుని నీటిని పంపింగ్ చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన బావలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించకుండా సంబంధించి శాఖల అధికారులు బావులు అద్దెకు తీసుకోని నీటిని అందిస్తుండడంపై ప్రజలు బహిరంగంగానే మండిపడుతున్నారు. తక్షణమే సదరు బావిని వినియోగంలోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

పర్వతగిరి : కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని కల్లెడ ఎంపీటీసీ క్లస్టర్ పరిధిలోని బూరుగుమల్ల, మంగ్యాతండా, ముంజాలకుటతండా, దౌలత్‌నగర్ క్లస్టర్ పరిధిలోని చెరువుకొమ్ముతండా, ఇస్లావత్ తండా గ్రామ శాఖల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, ముఖ్యనాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కడియం కావ్యను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు నాయకత్వంలో మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యాచరణ చేపడుతున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఎంపీగా కావ్యను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు సర్వర్, నాయకులు రమేశ్‌నాయక్, తిరుపతినాయక్, వెంకన్నబాబు, భద్రు, సావిత్రి, కత్తుల ఐలయ్య, దండపల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి, క్రిష్టాపురం, వాంకుడోతుతండా, గన్నారం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఝాన్సీరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడార. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ తిరుమల కృష్ణమాచార్యులు, నాయకులు మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి, గుగులోతు శ్రీనివాస్, కుంట రమేశ్, బండి రాజేంద్రప్రసాద్, కళ్యాణ్, నవీన్, గిరగాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో..

సంగెం : మండలంలోని నార్లవాయి, నల్లబెల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బూక్యా వెంకన్న, బానోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్, నర్సయ్య

ఖానాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని పద్మావతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఇన్‌చార్జ్‌లు చెడుపాక ఉపేందర్, గిరగాని నర్సయ్య తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. యాసంగిలో రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించి సరైన ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయిస్తే నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, రాజయ్య, కృష్ణారెడ్డి, వీరేశ్, శ్రీను, వెంకటప్రసాదరావు, యాకుబ్‌పాషా, వెంకన్న, రవీందర్‌రెడ్డి, రాంనర్సింహారెడ్డి, వెంకన్న, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నల్లబెల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలోని పెద్ద చెరువు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పరికి పవన్ తన ద్విచక్ర వాహనంపై నల్లబెల్లి పెద్ద చెరువు దిశగా ప్రయాణిస్తుండగా నల్లబెల్లి వైపు వస్తున్న మేఘ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న అడెపు సతీశ్ నడుపుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్ కాలుకు తీవ్ర గాయం కావడంతో నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

ఆలయ గర్భగుడికి దర్వాజ ప్రతిష్ఠాపన



దర్వాజకు పూజ చేస్తున్న అర్చకులు, ప్రజలు

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం శివారులోని ఊరగుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ గర్భగుడి దర్వాజాను అర్చకులు శివకృష్ణ మంత్రోచ్చారణల నడుమ ఆదివారం ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన కీసరి సాంబరాజు-అపర్ణ దంపతులు గర్భగుడి దర్వాజాను బహూకరించగా వారిని అర్చకులు, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో మండల నర్సింహరాములు, అనుమాండ్ల మల్లేశం, నామాల రవి, కాసుల శ్రీను, దొంతి మధూకర్‌రెడ్డి, రంగారావు, కల్లెపు రాజశేఖర్‌గౌడ్, మండల కుమారస్వామి, మండల అనిల్, నాగరాజు, రాంబాబు, కీసరి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వివాహానికి చేయూత



రాయపర్తి : మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలి వివాహానికి ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం రూ.10 వేల చేయూత అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలి తల్లిదండ్రులు ఆరెల్లి పద్మ-బొంద్యాలు సమక్షంలో దివ్యాంగురాలికి ఆయన నగదును మైలారం గ్రామానికి చెందిన బిల్లా వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన లక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో రూ.5,500లు సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలమాస సారయ్య, మంద యాకన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నెక్కొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2008-09 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదవిన పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తరువాత ఒకరినొకరు పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనందడోలికల్లో తేలియాడారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు శ్రీధర్, రామ్మూర్తి, సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, గీత, పూర్వవిద్యార్థులు సలీం, రాము, శరత్, రాజేశ్, శ్వేత, జ్యోతి, ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న శివకుమార్, నాయకులు

గీసుకొండ : వరంగల్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని మొగిలిచర్ల, గోపాల్‌రెడ్డినగర్, పోగుల ఆగయ్యనగర్ తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాధారపు శివకుమార్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడచిన పదేళ్లలో దేశం, రాష్ట్రం అనేక రంగాల్లో ముందుకు దూసుకుపోతోందని తెలిపారు. ప్రధాని మోదీ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తునఆనరని చెప్పారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేశ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కామగోని రఘుపతి, నాయకులు బిల్ల రమేశ్, లెంకలపెల్లి స్వామి, రాధారపు మల్లికార్జున్, కూనమల్ల రవి, గనిపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన గద్దల ఉప్పలయ్య మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. ఉప్పలయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఓరుగల్లు కీర్తిని చాటాలి

ఖిలా వరంగల్: మే 1, 2వ తేదీల్లో వనపర్తిలో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారులు ఓరుగుల్లు కీర్తిని చాటాలని వరంగల్ కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జయదేవ్, ఆర్యన్ రిషికేష్, శివదేవ్, జశ్వంత్, రోహిత్‌రాజ్‌ను భూపేష్‌నగర్‌లో కిక్ బాక్సింగ్ జిల్లా కార్యదర్శి ఇమ్మడి సంజీవ్ కుమార్, కోచ్ కల్లెపు సతీష్‌చంద్ర, శివసాయితో ప్రభాకర్ ఆదివారం అభినందించారు. మే 4న జిల్లా కమిటీ ఎన్నికలు, నూతన మండలాల సభ్యత్వ నమోదు ఉంటాయని తెలిపారు.

ఎంపీగా కావ్యను గెలిపించండి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున వరంగల్ స్థానానికి పోటీ చేస్తున్న కడియం కావ్యకు ఓటు వేసి గెలిపించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. మండలానికి చెందిన పలువురు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలనూ అమలు చేయనున్నట్టు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీ జయకేతనం ఎగరేసి కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధిని గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు దొడు ప్రవీన్, దొడు భరత్, అభిలాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



కూలీలతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను తదనంతరం విస్మరించిన క్రమంలో కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని మహేశ్వరం, లక్నేపల్లి, గురిజాల గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆదివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనేక మోసపూరిత హామీలు గుప్పించి ఓట్లు దండుకుని గద్దెనెక్కిందని తెలిపారు. తదనంతరం అన్ని హామీలనూ విస్మరించి దుష్టపాలన సాగిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే చెందుతుందని చెప్పారు. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ మాదన్నపేట చెరువులో నీటిని నింపలేని అసమర్థులు పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డిగతంలో ఇచ్చిన హామీలను విస్మరించి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచే ఎత్తుగడతో మళ్లీ కొత్త హామీలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో పార్లమెంట్‌లో తెలంగాణ అభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేయాలని సూచించారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాలోత కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీజేపీ జయకేతనం ఎగరేయాలి



ప్రచారం చేస్తున్న పుల్లారావు, నాయకులు

నర్సంపేట : మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జయకేతనం ఎగరేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, 172వ బూత్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కంభంపాటి పుల్లారావు ఆకాంక్షించారు. ఆ పార్టీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 172వ బూత్ పరిధిలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడారు. సీతారాం నాయక్‌కు ఓటేసి గెలిపిస్తే పేదల అభివృద్ధి, సంక్షేమానికి బాటలు పడతాయని చెప్పారు. సీతారాంనాయక్ భారీ మెజార్టీతో గెలిచే దిశగా నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, తౌటం నిశాంత్, వలస సంతోశ్, ఆడెపు సంధ్యారాణి, పాలబోయిన నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం



ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు జడల చంద్రశేఖరంను పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి మెమోంటోతో బహూకరించారు. అనంతరం శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. చంద్రశేఖరం దశాబ్దాలపాటు ఉపాధ్యాయుడిగా విద్యార్థులను సన్మార్గంలో నడిపించే దిశగా ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఉద్యోగులందరికీ విరమణ తప్పదని, తదనంతరం సామాజిక సేవలకు జీవితాన్ని కేటాయించాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం 39 శాతం ఫిట్‌మెంట్, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్, 398 ఉపాధ్యాయులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇప్పిస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, మాజీ ప్రధాన కార్యదర్శి పట్టాభి, హనుమకొండ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ, నోడల్ అధికారి లింగారెడ్డి, మండల అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, రాజగోవింద్, చింతనెక్కొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మునీశ్వర్, నాయకులు

చెన్నారావుపేట : మే డే వేడుకలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునీశ్వర్ కోరారు. ఈ మేరకు మేడే వేడుకల వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఏకం కావాలని సూచించారు. వాడవాడల మేడే జెండాలను ఎగరేసి కార్మికుల ఐక్యతను చాటాలని చెప్పారు. ఐక్యపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆకుపపెల్లి రమేశ్, భిక్షపతి, సంపత్, బాషా, సదానందం, సతీశ్, బార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

దామెర: మొక్కజొన్న చేనుకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని దగ్ధమైన ఘటన మండలంలోని కోగిల్వాయి శివారులో ఆదవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దండిగం కుమారస్వామికి చెందిన 15 గుంటల మొక్కజొన్న పంట పూర్తిగా కాలిపోయింది. రైతులు ఫైర్ ఇంజన్‌కు, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై కొంక అశోక్, ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎస్సై చొరవతో మంటలు త్వరగా ఆర్పివేశారని లేనిపక్షంలో చుట్టు పక్కల ఉన్న మొక్కజొన్న చేలకు మంటలు వ్యాపించేవన్నారు. ఎస్సై, ఫైర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.